క్లుప్తంగా

జాతరలు సంస్కృతికి నిదర్శనం

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



దోలు వాయిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అందోల్): జాతరలు సంస్కృతి, సాంప్రదాయాలకు నిదర్శనమని ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. భూత్కూర్ గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న బీరప్ప కల్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే జాతరలు, ఉత్సవాలు ప్రత్యేకమైందన్నారు. ఆలయాల అభివృద్ధికి, జాతరలకు, పండగలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కళావతి, వరము చైర్మెన్ వీరారెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి శివాజీరావు, నాయకులు సంగమేశ్వర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'పర్యావరణాన్ని కాపాడాలి'



మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం

సంగారెడ్డి టౌన్: పర్యావరణాన్ని కాపాడాలని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం అన్నారు. శనివారం సంగారెడ్డి మండలంలోని పసల్వాది గ్రామంలో సౌర విద్యుత్ యూనిట్ల ఏర్పాటుకు శ్రీనిధి రుణాలపై మహిళా సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సౌర విద్యుత్ ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఫుడ్ ప్రాసెస్సింగ్, పర్యావరణ పరిరక్షణకు తీసుకోవల్సిన చర్యలపై సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీందర్, ఐకెపి వెంకట్, మహిళా సంఘాల సభ్యులుపాల్గొన్నారు.

పిల్లల భద్రతకు ప్రాధాన్యం



పరిశీలిస్తున్న పీడీ పద్మావతి

నారాయణఖేడ్: పిల్లల అభివృద్దే అంగన్‌వాడీ టీచర్ల లక్ష్యం కావాలని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారిణి పద్మావతి తెలిపారు. ఖేడ్ సాయిబాబా ఫంక్షన్‌హాల్లో శనివారం ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సంబంధించి వివిధ సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లతో మేళా నిర్వహించారు. పిల్లల భద్రతకు సంబంధించి టీచర్లు రూపొందించిన మెటీరియల్స్‌ను పరిశీలించారు. ఆటపాటలతోపాటు అభ్యాసానికి సంబంధించి టీచర్లకు తగిన సూచనలు, సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో అజీమ్‌ప్రేమ్‌జీ ఫౌండేషన్ అధికారి ఎం.శ్రీనివాస్, సీడీపీవో సుజాత, అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ శ్రమదానం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

హత్నూర(సంగారెడ్డి): ప్రతివారం మహిళా సమైక్య ఆధ్వర్యంలో శ్రమదానం, పారిశుద్ధ్యంపై కార్యక్రమాలు నిర్వహించాలని మండల ఐకేపీ ఏపీఎం దేవేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన హత్నూర గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ వీరాస్వామి గౌడ్ అధ్యక్షతన సామాజిక అంశాలపై మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం దేవేందర్ మాట్లాడుతూ ప్రతివారం గ్రామంలో మహిళా సమైక్య ఆధ్వర్యంలో 50 వారాలపాటు శ్రమదానం నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమైక్య అధ్యక్షురాలు శిరీష, సీసీ మహేష్ , వీవో లక్ష్మయ్య, నాయకులు రవి, పెంటేష్, ఆసిఫ్, మేరాజ్ గ్రామ మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శ్రీశైల మహా క్షేత్రానికి పాదయాత్ర

ఝరాసంగం(జహీరాబాద్): శ్రీశైల మహా క్షేత్రానికి ఝరాసంగం నుంచి పాదయాత్రగా శివ దీక్షాపరులు తరలి వెళ్లారు. శుక్రవారం రాత్రి కేతకి సంగమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం వేకువ జామున ప్రత్యేక పూజల అనంతరం మేదపల్లి, ఈదులపల్లి గ్రామాల మీదుగా తరలి వెళ్లారు. నారాయణఖేడ్ లోని వివిధ మండలాల నుంచి సుమారు 300 మందితో కలిసి 17వ మహా పాదయాత్రగా బయలుదేరామని నిర్వాహకులు పేర్కొన్నారు. అమృత్, నాగన్న మాలిపటేల్, వెంకట్ రమణ రెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధి హామీకి ఆధార్ లింక్

- జాబ్ కార్డుతో అనుసంధానం
- కూలీల నుంచి వివరాల సేకరణ
- జిల్లాలో పూర్తికావస్తున్న ప్రక్రియ



పనులను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సంగారెడ్డి టౌన్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో వలసలను నివారించేందుకు అప్పటి ప్రభుత్వం ఈ పథకం ప్రవేశపెట్టింది. ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అడ్డు వేసేందుకు కేంద్ర ప్రభుత్వం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. కూలీల హాజరు నమోదు కోసం ఇప్పటికే నేషనల్ మొబైల్ మానిటరింగ్ పద్ధతిని అమల్లోకి తెచ్చిన కేంద్రం తాజాగా కూలి చెల్లింపులను కొత్త విధానాన్ని అమలు చేస్తుంది. ఉపాధి కూలీల జాబ్ కార్డులను వారి ఆధార్ కార్డుతో అనుసంధానం చేసి బోగస్ కార్డులన తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్రం విడుదల చేసిన నిధులు నేరుగా కూలీల ఖాతాలో జమావుతాయి. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేర గ్రామ స్థాయిలో సంబంధిత శాఖ అధికారులు జాబ్ కార్డులు ఉన్న వారి నుంచి ఆధార్ వివరాలను సేకరించి అనుసంధానం చేస్తున్నారు. సరైనవి లేకపోవడంతో తొలగిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా అనుసంధానం

జిల్లా వ్యాప్తంగా 24 మండలాలు, 639 గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో 2,33,159 జాబ్ కార్డులు ఉన్నాయి. ఉపాధి హామీలో భాగంగా గ్రామాలలో జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి. గ్రామాల్లో నీటి నిల్వ కట్టడాలు, ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్, పూడికతీత, పంట నూర్పిడి, కల్లాలు, లింకు రోడ్డు, హరితహారం, నర్సరీల నిర్వహణ తదితర పనులు కొనసాగుతుంటాయి. ఉపాధి కూలీలకు ప్రస్తుతం బ్యాంకు, పోస్టల్ శాఖ ద్వారా కూలి చెల్లిస్తున్నారు. కూలీలకు కూలి చెల్లింపులో పూర్తి పారదర్శకత తీసుకురావాలని ఆధార్ అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ఆధార్ అనుసంధానంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందన్నారు. కూలీల జాబ్ కార్డుకు ఆధార్ లింకైతే బ్యాంకు, పోస్టల్ ఖాతాలలో డబ్బులు జమ కానున్నాయి. ఒకే పేరుతో రెండుగా ఉన్న జాబ్ కార్డులు ఆధార్ అనుసంధానంతో బోగస్ జాబ్ కార్డులు తొలగనున్నట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న జాబ్ కార్డులు కూలీల సంఖ్య ఆధార్ అనుసంధానంతో బోగస్ కార్డులు తొలగిస్తారు. దీంతో కూలీల సంఖ్య తగ్గుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియ పూర్తికావస్తుంది. ఇప్పటివరకు 2,33,159 మంది కూలీలు ఉండగా అందులో 2,32,139 మంది ఆధార్ అనుసంధానం చేశారు. జిల్లాలో 24 మండలాలు ఉండగా 639 గ్రామాల్లో సుమారు 2,33,159 జాబ్ కార్డులు ఉన్నట్టు సమాచారం. ఆధార్ నమోదు చేసింది 2,32,299 మాత్రమే.

అక్రమాలకు అడ్డుకట్ట



ఉపాధి హామీ పథకంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆధార్ వివరాలను అనుసంధానం చేసుకోవాలి. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఆధార్ అనుసంధానం ప్రక్రియ కొనసాగుతుంది. ఆధార్ లేని కార్డులు తొలగిపోతాయి. ఆధార్ బేస్డ్ పేమెంట్‌తో అక్రమాలకు పూర్తి అడ్డుకట్ట పడుతుంది .

-శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ, సంగారెడ్డి

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి

కొండాపూర్(సంగారెడ్డి): అర్హులు ఇండ్ల స్థలాల సాధనకు 9న నిర్వహించే చలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం సంగారెడ్డిలో లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలకు, అర్హులైన వారందరికీ ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లమ్మ, ఎల్లమ్మ, వినోద, రాజు, మల్లేశం, ప్రశాంత్, మల్లేశం, వినోద పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మెరుగైన సేవలు



డీఎంను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్

నారాయణఖేడ్: ఆర్టీసీ కార్మికులు, అధికారులు, సమష్టిగా కృషిచేస్తేనే ప్రయాణికులకు మెరుగైన సేవలు అం దించగలమని ఖేడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణకుమార్ తెలిపారు. ఆర్టీసీ డిపోలో అద్దెబస్సుల డ్రైవర్లకు శిక్షణను శనివారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల ప్రాణాలు తమ చేతుల్లో ఉన్నాయని, ఈ విషయాన్ని డ్రైవర్లు గుర్తుంచుకొని బస్సులు నడపాలని సూచించారు. డీఎం మల్లేశయ్యను ప్రిన్సిపాల్ శాలువా కప్పి సన్మానించారు. అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, మెకానికల్ ఇంజినీర్ ధనుంజయ్, ఎస్టీ నందులాల్, మార్కెటింగ్ సెల్ మేనేజర్ పాండు, కళాశాల అధ్యాపకులు విష్ణువర్ధన్, భాస్కర్ పాల్గొన్నారు.

హద్దులను తొలగించి రియల్ దందా

బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ల ఆరోపణ

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని హద్దులను తొలగించి కొంతమంది అక్రమార్కులు రియల్ వ్యాపారం చేస్తున్నారని కౌన్సిలర్లు హన్మంత్‌రెడ్డి, నిహారిక వరప్రసాద్‌రెడ్డి, సంధ్య జైపాల్‌రెడ్డి, సంతోష లక్ష్మారెడ్డి, సాయికిరణ్‌రెడ్డిలు ఆరోపించారు. శనివారం విలేకరుల సమావేశంలో బొల్లారంలో వారు మాట్లాడారు. బొల్లారంలోని 172 సర్వేనంబర్‌లో ఇండస్ట్రీలకు చెందిన స్థలాలు మాత్రమే ఉన్నాయన్నారు. కొంతమంది అక్రమార్కులు ఒకే సర్వేనంబర్ చూపి సుమారు 25 ఎకరాల స్థలంలో రియల్‌వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా గుంటచొప్పున ప్రస్తుతం క్రయ విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కోర్టును కూడా ఆశ్రయిస్తామని వారు అక్రమార్కులను హెచ్చరించారు.

కొనసాగుతున్న ఉర్సు



దర్గాను సందర్శించుకుంటున్న జనం

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం రెండో రోజు దర్గాను సందర్శించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు కర్నాటక నుంచి కూడా ప్రజలు తరలి వచ్చి దర్గాను దర్శించుకున్నారు. ఆదివారం జాతరలో పశువుల సంత పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. మేలు రకం పశువులు కలిగిన రైతులకు ప్రముఖ కళాకారుడు హోతి బస్వరాజ్ బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

జహీరాబాద్: పట్టణంలో సయ్యద్ అబ్దుల్ అజీజ్ ఖాద్రి దర్గా ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం నిర్వహించిన ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎం.డి.తన్వీర్ చాదర్ సమర్పించి మొక్కు తీర్చుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఫరాస్‌ఖాద్రి, గౌసొద్దీన్, కాశీనాథ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ర్యాకల్‌లో మహా పడిపూజ

నారాయణఖేడ్: ర్యాకల్‌లో శనివారం శివదీక్షాదారులు మహా పడిపూజ నిర్వహించారు. బంజారా సేవాలాల్ సంఘం అధ్యక్షుడు రమేష్ చౌహాన్ సందర్శించి ప్రత్యేకపూజలు చేశారు.

◆ 25 మందికి కోవిడ్ టెస్టులు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 25 మందికి కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగెటివ్ వచ్చినట్లు వైద్యసిబ్బంది మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ 23 మందికి నిర్వహించినట్లు తెలిపారు.

◆ పుస్తె, మెట్టెలు అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామానికి చెందిన ఏర్పుల పెంటయ్య కుమారుడి వివాహానికి బీజేపీ నాయకులు రాజిరెడ్డి శనివారం పుస్తె, మెట్టెలను అందజేశారు. పేదలకు తాము ఎప్పుడూ అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు.

◆ ఉపయుక్తంగా డయాలసిస్ కేంద్రం

నారాయణఖేడ్: ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మన్ అహీర్ పరశురాం తెలిపారు. శనివారం డయాలసిస్ కేంద్రాన్ని వారు సందర్శించారు. చికిత్స పొందుతున్న వారిని వైద్యం అందుతున్న తీరును ఆరాతీశారు.

◆ ఉచిత వైద్యశిబిరం

మునిపల్లి(అందోల్): ఎంఎస్ఆర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పెద్దగోపులారంలో సర్పంచ్ కీర్తి కుమారి ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

◆ చిన్నారులకు శిబిరం

కల్హేర్(నారాయణఖేడ్): చిన్నారుల కోసం కల్హేర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో మన ఊరు-మన డాక్టర్‌లో భాగంగా మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ కూతురు గిరిజ షెట్కార్ చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. జలుబు, జ్వరం, తదితర సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు చికిత్సల అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోచయ్య, సోషల్ మీడియ మండల ఇన్‌చార్జి ఎండి.చాంద్, దాడె సాయిలు, ద్యావల శ్రీనివాస్, తడ్గురి రవి పాల్గొన్నారు.



కొనసాగుతున్న పాత పంటల జాతర



గుంజోటిలో పాత పంటలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): గుంజోటి, హుస్సెల్లి గ్రామాల్లో పాత పంటల జాతర నిర్వహించారు. డీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాత పంటల జాతర సందర్భంగా చిరుధాన్యాలతో కూడిన ఎడ్ల బండ్లను ఆయా గ్రామాల్లో ఊరేగించారు. మహిళలు నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

వైభవంగా శ్రీమాణిక్ ప్రభు ఆలయ బ్రహ్మోత్సవం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శ్రీమాణిక్ ప్రభు ఆలయ బ్రహ్మోత్సవం అంగరంగ వైభవంగ నిర్వహించారు. జనవరి 31 నుంచి ప్రారంభమైన ఈ ఉత్సవం శనివారం ముగింపు వేడుకలు నిర్వహించారు. శ్రీ సద్గురు మాణిక్‌ప్రభు, శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీరుక్మిణి విఠలేశ్వరస్వాముల బ్రహ్మోత్సవాలు శ్రీ సద్గురు అప్పాసాహెబ్ మహరాజ్, పుత్రులు సద్గురు బబన్‌రాజ్ మహరాజ్ చైనయాజీగారి ఆధ్వర్యంలో నిర్వహించారు. మందిరంలో బబన్‌రాజ్ మహరాజ్ శ్రీగణపతి హోమం, మహాభిషేకం, హారతి అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఓదెల రాజేశ్వరీ శ్రీమాణిక్ ప్రభు మందిరం భక్తమండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

చిట్కూల్‌లో మహాశివరాత్రి జాగరణ

నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: మహాశివరాత్రి పురస్కరించుకుని ఎన్ఎంఆర్ యువసేన ఆధ్వర్యంలో చిట్కుల్‌లో మహాశివరాత్రి జాగరణలో భాగంగా భక్తి కార్యక్రమం, శివోత్సవం నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. శనివారం చిట్కుల్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 18న మహాశివరాత్రి సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, జాగరణ ఓ టీవీ ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు. శ్రీ మల్లికార్జునస్వామి ఆలయ ఆవరణలో సాయంత్రం నుంచి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, హోమం, మహన్యాస రుద్రాభిషేకం , దూప, దీప సహిత పూజలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ గాయనీ, గాయకులచే సంగీత విభావరి, భక్తిరస సంప్రదాయ నృత్యాలు, వినోదభరిత కార్యక్రమాలు భక్తుల కోసం ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. శివరాత్రి మధ్యాహ్నం నుంచి తెల్లవారే వరకూ అర్చకులచే శివపార్వతుల కల్యాణం, లింగోద్భవ,అభిషేకం నిర్వహిస్తామన్నారు.

లోకల్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తా

జహీరాబాద్: సినిమా రంగంలో లోకల్ టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నానని, ఆసక్తి గల వారు సంప్రదించాలని డీసీసీబీ చైర్మన్, సినీ నిర్మాత ఎం.శివకుమార్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సురక్ష్‌ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా పతాకంపై ఏ.ఎస్.రవికుమార్ చౌదరి దర్శకత్వంలో నిర్మిస్తున్న 'తిరగబడరా సామి' అనే చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. చిత్రంలో రాజ్ తరుణ్, మాల్వి హీరో హీరోయిన్‌లుగా, సహాయ నటులుగా రఘుబాబు, మకరంద్ దేశ్‌పాండే, పోసాని, రాజా రవీంద్ర, భరత్ భాటియా నటిస్తున్నట్లు వివరించారు. 6 నుంచి మార్చి 6వరకు జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటుందన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ప్రజావసరాలకనుగుణంగా అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శనివారం పోచారం, ముత్తంగి, చిట్కుల్, రామేశ్వరం బండ, బచ్చు గూడెం, ఇంద్రేశం, ఐనోలు, చిన్నకంజర్ల, పెద్దకంజర్లలో రూ.95లక్షలతో చేపటనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రణాళిక బద్ధంగా గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు నర్సరీలు ఏర్పాటు చేసి, పెద్ద ఎత్తున అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహిస్తున్నామన్నారు. పల్లె ప్రగతి ద్వారా నిధులు అందిస్తూ, పారదర్శకంగా ఖర్చు చేయడం జరుగుతోందన్నారు. ముత్తంగి గ్రామ పరిధిలోని సాయి ప్రియ కాలనీలో నూతన రామాలయ నిర్మాణ పనులకు భూమి పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా, జెడ్పీటీసీ సుప్రజా, వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, ఎంపీడీవో బన్సీలాల్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూన్ లోపు నూతన సబ్ స్టేషన్లు

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ప్రభుత్వం మంజూరు చేసిన 33/11 కెవి సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు వచ్చే జూన్ లోపు పూర్తవుతాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో నిర్మించనున్న నూతన సబ్ స్టేషన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అమీన్‌పూర్ చక్రపురి కాలనీ, జీఎంఆర్ ఫంక్షన్ హాల్, సింఫనీ పార్క్, తెల్లాపూర్ మున్సిపాలిటీ, అమీన్‌పూర్ గోశాల పరిధిలో నూతన సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నామని, వీటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 కోట్లు మంజూరు చేసిందన్నారు. నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తయితే, నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, ట్రాన్స్‌కో సివిల్ డీఈ కరుణాకర్ రెడ్డి, డీఈ నర్సింగ రావు, ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈ మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డాక్టర్ అంబేద్కర్ జీవితం నేటి తరాలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల తండా, కొల్లూరులో ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో ఏర్పడిన రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ మల్లేపల్లి లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్, సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్



కేలండర్‌ను ఆవిష్కరించిన శ్రీకాంత్ గౌడ్, నాయకులు

పటాన్‌చెరు టౌన్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి గడీల శ్రీకాంత్ గౌడ్ అన్నారు. శనివారం ముత్తంగిలో బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ రూపొందించిన కేలండర్‌ను బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్‌తో కలిసి శ్రీకాంత్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ...మూడు సంవత్సరాలు గడుస్తున్నా విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీఇంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. ఉన్నత చదువులకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థి సంఘం నాయకుడు విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ...సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు నిలయాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఓబీసీ మోర్చా .అధ్యక్షుడు రాచమల్ల నరేందర్‌గౌడ్, నాయకులు నర్సింగ్ యాదవ్, ఆదిత్య, కావలి వీరేశం, చంద్రశేఖర్, రవీందర్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పలుగు పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా సుదర్శన్ గౌడ్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం షేర్ ఖాన్ పల్లిలోని పలుగు పోచమ్మ ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడిగా సుదర్శన్ గౌడ్ ను అధికారికంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ప్రకటించారు. షేర్ ఖాన్ పల్లి గ్రామానికి చెందిన సుదర్శన్ గౌడ్ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా, పాలకమండలి సభ్యులుగా ఆకుల మధుసూదన్ రెడ్డి, పెద్ద రామగోని నాగభూషణం గౌడ్, తలారి నర్సింలు, గొల్ల పోచయ్య, కోటగళ్ల సునీత, ఎం శ్రీకాంత్ పూజారి లను నియమించారు. నూతన పాలకమండలిని సోమవారం ఎమ్మెల్యే మదన్ రెడ్డి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. ప్రమాణ స్వీకారోత్సవానికి పెద్ద ఎత్తున హాజరు కావాలని బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

నేడు మాఘ పౌర్ణమి

పటాన్‌చెరు టౌన్: మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం పట్టణంలో మంజీర క్యాంపస్‌లోని శ్రీరామలింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహిస్తారని ఆలయ అర్చకులు మహేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ...ఆదివారం , సోమవారం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

'ప్రవేశాలపై ప్రచారం చేపట్టాలి'

నారాయణఖేడ్: మైనార్టీ గురుకులాల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు గ్రామాల్లో ప్రచారం చేపట్టాలని మైనార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. శనివారం ఖేడ్ మైనార్టీ గురుకులంలో ప్రిన్సిపాల్ ఖాదర్, అధ్యాపకులతో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు అలీ, కౌన్సిలర్ మాజీద్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బాసిత్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, నాయకులు ఉబేద్, గౌస్‌చిస్తి సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ మైనార్టీలు విద్యాపరంగా అభివృద్ధి చెందాలని గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

'రైతాంగ పోరాట యోధుడు మగ్దూం మొహియుద్దీన్'



సదాశివపేటలో నివాళ్లర్పిస్తున్న సీపీఐ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆయుధం పట్టి పోరాడిన మహాయోధుడు మగ్దూం మొహియుద్దీన్ అని సీపీఐ మండల కార్యదర్శి శంకరప్ప పేర్కొన్నారు. శనివారం మగ్దూం మొహియుద్దీన్ వర్ధంతి సీపీఐ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు నైజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు ట్రేడ్ యూనియన్ వ్యవస్థాపకుడు కామ్రేడ్ మగ్దూం మొహియుద్దీన్ అని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద, జిల్లా నాయకులు షఫీద్దిన్, సాదక్‌అలీ, ముస్తఫా, యాకుబ్‌అలి, అనసూజ, బుజ్జమ్మ, పూలమ్మ, శంకరమ్మ, రహమాబేగం పాల్గొన్నారు.

విగ్రహాలకు వినతి



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలని కోరుతూ భాషాపండిత సంఘాల ఉమ్మడి ఐక్యవేదిక పోరాట సమితి ఆధ్వర్యంలో నారాయణఖేడ్‌లో శనివారం మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలను అందజేశారు. 2017లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల్లో సీఎం కేసీఆర్ భాషాపండితులను అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తమను ఇప్పటికీ అప్‌గ్రేడ్ చేయలేదని వారు తెలిపారు. ఇప్పటికైనా సీఎం స్పందించి న్యాయం చేయాలని కోరారు.

జహీరాబాద్: భాషోపాధ్యాయులు, పీఈటీలను ఎస్ఏలుగా ఉన్నతీకరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. 20 సంవత్సరాల నుంచి భాషా పండితులు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు